
రెడ్‌హిల్స్‌లో ఓటు వేసిన బీఆర్ఎస్ నాంపల్లి అభ్యర్థి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రియాంకగౌడ్


లంగర్‌హౌస్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కార్వాన్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ


హకీంపేట్‌లో ఓటు వేసిన కార్వాన్ ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్

# నాంపల్లిలో 32.04 శాతం పోలింగ్

- **అహ్మద్‌నగర్‌లో ఓటు వేసిన ఎంఐఎం అభ్యర్థి మాజీద్ హుస్సేన్**
- **రెడ్‌హిల్స్‌లో ఓటు వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్**
- **హకీంపేట్‌లో కార్వాన్ ఎంఐఎం అభ్యర్థి మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్**
- **ఓటింగ్ సరళిని పరిశీలించిన నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమ్ మాన్‌సింగ్**

మెహిదీపట్నం నవంబర్ 30 : ఎన్నికల నియమ,నిబంధనలను పాటిస్తూ ప్రజలంతా ఓపికగా ఓటు వేయడంతో నాంపల్లి నియోజకవర్గంలో గురువారం అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక్కడ మైనార్టీల ఓట్లపై ప్రధాన పార్టీలు ఎంఐఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దృష్టి పెట్టడంతో ఎక్కువ మంది ఓట్లు వేయలేదు. దాంతో నాంపల్లి నియోజకవర్గంలో కేవలం 32,4 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని మెహిదీపట్నం, అహ్మద్‌నగర్, ఆసిఫ్‌నగర్, మల్లేపల్లి, రెడ్‌హిల్స్, విజయ్‌నగర్‌కాలనీ డివిజన్లలోని 285 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. మందకొడిగా పోలింగ్ సాగడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. ఉదయం 9 గంటల వరకు వాతావరణం చల్లగా ఉండి ఎండ లేకపోవడంతో ఎక్కువమంది ఓటర్లు 11 గంటల తర్వాత పోలింగ్ కేంద్రాలకు రావడం ప్రారంభించారు.

ఉదయం 11 గంటలకు 5.42 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 18.62శాతం, 3 గంటల వరకు 22.7 శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి నియోజకవర్గంలో పోలింగ్ కేవలం 32.4శాతంగా నమోదైంది. అహ్మద్‌నగర్‌లో ఎంఐఎం నాంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ మాజీద్ హుస్సేన్, రెడ్‌హిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్‌ల్లో నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమ్ మాన్‌సింగ్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ నిఖిత పంత్, దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ బాలస్వామి ఓటింగ్ సరళిని, బందోబస్తును పర్యవేక్షించారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.


నాంపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ మాజీద్ హుస్సేన్

కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ ఓటు హక్కును వినియోగించుకోగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ పలు ప్రాంతాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

# పాత నగరంలో పోలింగ్ ప్రశాంతం

- **అక్కడక్కడా స్వల్ప ఘటనలు**

చార్మినార్, నవంబర్ 30 : శాసనసభ ఎన్నికలు గురువారం పాతనగరంలో ప్రశాంతంగా కొనసాగాయి. యాకుత్‌పుర నియోజకవర్గంలోని పలు డివిజన్లలో చదురు మదురు సంఘటనలు మినహా అంతా ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు ప్రకటించారు. చార్మినార్ నియోజకవర్గంలో 30.04 శాతం పోలింగ్ నమోదైంది. బహదూర్‌పుర నియోజకవర్గంలో 39.11 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

### పోలింగ్ సరళి

ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. మధ్యాహ్నం తర్వాత ఓట్లు వేయడానికి ప్రజలు ముందుకు రావడంతో క్రమేణా పోలింగ్ శాతం మెరుగవుతూ వచ్చింది. 18 ఏండ్లు నిండిన యువతీ యువకులంతా కొత్తగా తమ ఓటును హక్కును సద్వినియోగం చేసుకుని సంతోషాన్ని పంచుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సెల్ఫీలు దిగుతూ సన్నిహితులకు షేర్ చేశారు.

### చదురు మదురు ఘటనలు

పోలింగ్ సరళిని పరిశీలించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముజీబుల్లా చోటా బజార్ ప్రాంతానికి చేరుకున్నారు. అదేసమయంలో ఎంఐఎం నాయకులు అక్కడకు చేరుకోవడంతో పరస్పరం నినాదాలు చేసుకున్నారు. అనంతరం ఎంఐఎం నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి ముజీబుల్లా సోదరుడు సలీంతోపాటు మరో ఇద్దరిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న హుస్సేనిఅలం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని అక్కడి నుండి వెళ్లగొట్టారు. దాడిలో గాయపడిన సలీంతోపాటు మరో ఇద్దరిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

యాకుత్‌పుర నియోజకవర్గంలో ఎంబీటీ, ఎంఐఎం నాయకుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఎంబీటీ అభ్యర్థి అమ్జాదుల్లా ఖాన్, ఖాలేద్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అదే సమయంలో ఎంఐఎం నాయకుడు అరాఫత్ ఎదురు పడటంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఇద్దరు నేతలను అక్కడి నుంచి పంపించారు.


ఓటు వేసిన బీఆర్ఎస్ బహదూర్‌పుర అభ్యర్థి ఇనాయత్‌అలీ బాక్రి


చార్మినార్ నియోజకవర్గంలో ఓటు వేసిన మహిళలు


తానాజీనగర్‌లో ఓటర్లకు స్లిప్పులు పంచుతున్న పోలింగ్ సిబ్బంది


ఫలక్‌నుమాలో మొదటి సారి ఓటు వేసిన యువతి


గుడిమల్కాపూర్‌లో చంటి పాపతో ఓటు వేయడానికి వచ్చిన దంపతులు

# చాంద్రాయణగుట్టలో ప్రశాంతంగా ఎన్నికలు

- **40 శాతం ఓటింగ్ నమోదు**
- **ఓటు వేసేందుకు క్యూలో మరో పది శాతం మంది!**


తానాజీనగర్ పోలింగ్ కేంద్రం వద్ద బారులుదేరిన ఓటర్లు

చాంద్రాయణగుట్ట, నవంబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల పండుగ గురువారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో మొత్తం 3,46,293 మంది ఓటర్లు ఉండగా ఎన్నికల అధికారులు 305 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయగా అవసరమైన చోట కేంద్ర బలగాలను మోహరించారు. మొత్తంగా నియోజకవర్గంలో సాయంత్రం ఐదు గంటల వరకు 40 శాతం ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ఒక్కక్కరుగా ఓటు వేసేందుకు జనం ఇండ్ల నుంచి బయటకు వచ్చారు. ఉదయం నుంచి మందకొడిగా ఓటింగ్ కొనసాగింది. మొదటి రెండు గంటల్లో కేవలం 4 శాతం ఓటర్లు మాత్రమే ఆసక్తి చూపించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల సమయానికి 16 శాతం నుంచి 20శాతం మధ్యలో ఓటింగ్ నమోదైంది. 3 గంటల వరకు 25శాతం, సాయంత్రం 5 గంటల వరకు 40శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. సమయం ముగిసినప్పటికీ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లతో కలిపి మరో పది శాతం ఓటింగ్ నమోదయ్యే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు.


దానయ్యనగర్ శారద హైస్కూల్‌లో ఓటు వేసిన బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి దంపతులు


గౌలిపురా మార్కెట్‌లో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళా ఓటర్లు


ఆసిఫ్‌నగర్ బైఠక్ ప్రాంతంలో పోలింగ్ స్టేషన్‌కు వీల్‌చైర్‌పై వస్తున్న వృద్ధురాలు